## విద్యార్థులకు చూచిరాత పోటీలు



ఆమనగల్లు, డిసెంబర్ 19 : జ్ఞాన వాహినీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల ప్రభుత్వ పాఠశాలలో 6,7,8,9,10 వ తరగతి విద్యార్థులకు మంగళవారం చూచిరాత పరీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి సీఐ జె. వెంకటేశ్వర్లు, ఎస్ఐ బలరాం ముఖ్యఅథితిగా హాజరై ప్రారంభించారు. నాలుగు మండలాల నుంచి 42 మంది విద్యార్థులు హాజరైనట్లు జ్ఞాన వాహినీ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 28న ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు నగదు అందజేయనున్నట్లు చెప్పారు. మాజీ ఎంపీపీ లలిత, ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి లక్ష్మీనారాయణ, కోశాధికారి రవీందర్, సభ్యులు సత్యం, నర్సింహ, రంగారావు, జగదీశ్, యాదగిరి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం



శంకర్‌పల్లి, డిసెంబర్ 19 : షాట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని గణేశ్‌నగర్‌లో జరిగింది. కాలనీలో నివాసం ఉండే వడ్డె అనసూయ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తుండేది. ఎప్పటిలాగే తన ఇంటికి తాళం వేసి పనికి వెళ్లింది. షాట్ సర్క్యూట్‌తో ఇంట్లో నుంచి పొగలు రావడంతో చుట్టు పక్కల వారు అప్రమత్తమై మంటలు ఆర్పివేశారు. ఘటనా స్థలాన్ని ఆర్ఐ సుప్రియ పరిశీలించింది. రూ.30 వేల విలువగల సామగ్రి దగ్ధమైందని బాధితురాలు తెలిపారు.

## వ్యక్తి అదృశ్యం



మనోజ్‌కుమార్ (ఫైల్)

నందిగామ, డిసెంబర్ 19 : ఇంటి నుంచి పెరుగు కోసం వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మనోజ్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి నందిగామ అయ్యప్పటెంపుల్ కాలనీలో కొన్ని సంవత్సరాలుగా నివాసముంటూ ఓ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో పెరుగు తీసుకురావడానికి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మనోజ్‌కుమార్ తమ్ముడు సాయి పంత్ మంగళవారం నందిగామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలకు పురుషుల నిరాసక్తత

# శ్రీవారూ.. మీరెందుకు దూరం

**కాబోయే అమ్మకు ఆపద. మాతృమూర్తిగా మారే తరుణంలో అనుకోని ఇబ్బందులు. పురుష పుంగవుల్లో నెలకొన్న అపోహ అమ్మలకు ముప్పు తెస్తున్నది. కనీసం..కట్టుకున్న భర్త సైతం 'ఆమె' భారాన్ని పంచుకోవడంలేదు. అన్నింట్లో ఎంతో ప్రేమను పంచే శ్రీవారు ఆ...ఆ'పరేష(షా)న్' అంటేనే అల్లంత దూ రంలో ఉంటున్నాడు. గర్భస్తం నుంచి బిడ్డ ప్రసవం వరకు ఎంతో వేదనను అనుభవిస్తున్న 'అమ్మ'.. శస్త్ర చికిత్స సమయంలో మరోమారు కడుపు కోతకు గురవుతున్నది. సృష్టికే ఆధారమైన ఆమెకు ఇంట్లో శ్రీవారి నుంచి ఆదరణ లభించకపోవడం ఆవేదనకు గురిచేస్తున్నది. వేసెక్టమీ ఆపరేషన్లతో ఎటువంటి నష్టం ఉండదని వైద్యశాఖ స్పష్టంచేస్తున్నా.. పురుష పుంగవుల్లో మాత్రం మార్పురావడం లేదు. గడిచిన నాలుగున్నరేండ్లలో జిల్లావ్యాప్తంగా 89 మాత్రమే వేసెక్టమీ ఆపరేషన్లు జరుగగా.. 58,055 ట్యూబెక్టమీ శస్త్ర చికిత్సలు జరుగడం ఇందుకు నిదర్శనం. వేసెక్టమీ ఆపరేషన్లపై చైతన్యపర్చడంలో భా గంగా ఈనెల 11 నుంచి 24 వరకు జిల్లా వైద్యారోగ్యశాఖ వేసెక్టమీ శస్త్ర చికిత్స పక్షోత్సవాలను నిర్వహిస్తున్నది. ఈనెల 23 వరకు ప్రత్యేక వేసెక్టమీ క్యాంపులను నిర్వహిస్తున్నది.**



- **సంసార జీవితంపై తొలగని అపోహలు**
- **స్త్రీలకు తప్పని కడుపు కోతలు**
- **రంగారెడ్డి జిల్లాలో గడిచిన నాలుగున్నరేండ్లలో జరిగిన ట్యూబెక్టమీ ఆపరేషన్లు-58,055**
- **వేసెక్టమీ ఆపరేషన్లు 89 మాత్రమే**
- **ఈనెల 11 నుంచి 24 వరకు కొనసాగుతున్న వేసెక్టమీ శస్త్ర చికిత్స పక్షోత్సవాలు**
- **ఈనెల23 వరకు వేసెక్టమీ క్యాంపుల నిర్వహణ**

రంగారెడ్డి, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): వైద్య శాస్త్రం కొత్త పుంతలు తొక్కుతున్నా..ఇంకా అపోహలు.. అనుమానాలే. వేసెక్టమీ కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలపై పురుషుల్లో అపోహలు తొలగడంలేదు. వాటిని మహిళలకు సంబంధించినవిగా భావిస్తూ పురుషులు శస్త్ర చికిత్సలకు దూరంగా ఉంటున్నారు. దీంతో మహిళలే ముందుకొచ్చి శస్త్ర చికిత్సలు చేయించుకోవాల్సి వస్తున్నది. గ్రామీణ ప్రాంతాల్లో వెసెక్టమీ ఆపరేషన్ల ఊసే లేకపోగా.. నగరాల్లోనూ పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. దీంతో జిల్లాలోనూ ప్రతియేటా ఒక్క శాతం కూడా పురుషులు ఈ శస్త్ర చికిత్సలు చేయించుకోకపోవడం విస్మయం కలిగిస్తున్నది.

### పురుషులకే అధిక ప్రోత్సాహం..


ఒక్కో ట్యూబెక్టమీకి ప్రభుత్వం ప్రోత్సాహకంగా రూ. 880 ఇస్తుంటే.. అదే వేసెక్టమీకి రూ.1,100 వరకు ప్రభుత్వం చెల్లిస్తున్నది. ప్రోత్సహించిన వారికి రూ.200 అందజేస్తున్నది. వేసెక్టమీ శస్త్ర చికిత్సలను ప్రోత్సహించేందుకు ట్యూబెక్టమీ కంటే ఎక్కువ నగదును ప్రభుత్వం ఇస్తున్నప్పటికీ పురుషుల నుంచి స్పందన కరువవుతున్నది. ఫలితంగా వైద్యశాఖ అనుకున్న లక్ష్యానికి చేరువ కాలేకపోతున్నది. 2019 నుంచి 2023 నవంబర్ వరకు జిల్లావ్యాప్తంగా 58,055 ట్యూబెక్టమీ ఆపరేషన్లు జరిగితే వేసెక్టమీ ఆపరేషన్లు కేవలం 89 మాత్రమే జరిగాయి.

### కొనసాగుతున్న వేసెక్టమీ పక్షోత్సవాలు..

కుటుంబ నియంత్రణలో భాగంగా పురుషుల వేసెక్టమీ శస్త్ర చికిత్సలను ప్రోత్సహించేందుకు జిల్లా వైద్యారోగ్యశాఖ రంగారెడ్డి జిల్లాలో ఈనెల 11 నుంచి 24 వరకు పక్షోత్సవాలను నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా ఈనెల 18 నుంచి 23 వరకు ప్రత్యేక వేసెక్టమీ క్యాంపులను ప్రత్యేక నిర్వహిస్తున్నారు. 20న పెద్దాశపూర్ పీహెచ్‌సీలో, 21న సరూర్‌నగర్ సీహెచ్ సీలో, 22న షాద్‌నగర్ సీహెచ్‌సీలో, 23న కందుకూరు పీహెచ్‌సీలో క్యాంపులను నిర్వహిస్తున్నారు. 18న ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన క్యాంపునకు ఇద్దరు పురుషులు మాత్రమే వేసెక్టమీ ఆపరేషన్ చేయించుకునేందుకు వచ్చారు. ఆపరేషన్ థియేటర్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్య కారణంగా వారిని సరూర్‌నగర్ క్యాంపునకు రావాల్సిందిగా సూచించినట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు.

### వేసెక్టమీ సులువైన ఆపరేషన్

వేసెక్టమీ ఆపరేషన్ చాలా సులువైనది. నోస్కాల్పెల్ వేసెక్టమీ(ఎన్ఎస్‌వీ) ఆపరేషన్‌లో కోత, కుట్లు అనేవి ఉండవు. అయినా పురుషుల నుంచి స్పందన లేదు. సెక్స్ సామర్థ్యం తగ్గుతుందన్న భావన పురుషుల్లో ప్రధానంగా నెలకొనడంతోనే ఈ ఆపరేషన్లు చేసుకునేందుకు వారు ముందుకు రావడంలేదు. ఇది కేవలం అపోహ మాత్రమే. వైద్య శాఖ ఆధ్వర్యంలో వేసెక్టమీ ఆపరేషన్లపై అవగాహన కల్పిస్తూనే ఉన్నాం. ప్రతిఏటా ప్రత్యేక క్యాంపులను నిర్వహిస్తున్నాం.



**- వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో, రంగారెడ్డి జిల్లా**



### అధునాతన పద్ధతులున్నా..

ప్రస్తుతం కుటుంబ నియంత్రణకు పలు అధునాతన పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. కోత, రక్తస్రావం, కుట్లు లేకుండా శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. పురుషులకు చేసే వాటిని వేసెక్టమీగా వ్యవహరిస్తారు. నోస్కాల్పెల్ వేసెక్టమీ (ఎన్ఎస్‌వీ) పద్ధతి ద్వారా వీటిని చేస్తారు. శస్త్ర చికిత్స చేసిన 20 నిమిషాల్లోనే నడిచి ఇంటికి వెళ్లిపోవచ్చు. తర్వాత రోజు నుంచే తమ పనులను యథావిధిగా చేసుకోవచ్చు. ఎలాంటి ఇతర ఇబ్బందులు తలెత్తే అవకాశంలేదని వైద్యులు చెబుతున్నారు. మహిళలకు చేసే ట్యూబెక్టమీలో ప్రస్తుతం డబుల్ పంక్చర్ లైప్రోస్కోపీ(డీపీఎల్) అనే అధునాతన పద్ధతిని పాటిస్తున్నారు. దీన్ని కూడా ఎలాంటి కోత, రక్తస్రావం లేకుండానే చేస్తారు. కొద్దిపాటి విశ్రాంతితో యథావిధిగా పనులు చేసుకోవచ్చు. అయితే శారీరక శ్రమ ఎక్కువగా ఉండే మహిళలకు బదులుగా పురుషులు ముందుకొచ్చి వేసెక్టమీ శస్త్ర చికిత్సలు చేయించుకుంటే బాగుంటుందన్న అభిప్రాయాన్ని వైద్యులు వ్యక్తం చేస్తున్నారు.

# శ్రీనిధి కోళ్లతో మంచి ఆదాయం

*హైదరాబాద్ నుంచే దేశమంతా సరఫరా*

*తెలంగాణలో పెరిగిన డిమాండ్.. సీనియర్ శాస్త్రవేత్త డా.నిరంజన్*

వ్యవసాయ యూనివర్సిటీ , డిసెంబర్ : మాంసాహారులకు నాటు కోడిగా, అధిక పౌష్టికాహార గుడ్డుగా, అనేక తిను బండారాల్లో కూడా నాటు కోడి గుడ్డును వాడుతున్నారు. పల్లెల్లో ప్రతి ఇంటా కోళ్ల పెంపకం అదనపు ఆదాయంగా మారింది.నగర సమీపంలో కూడా షెడ్లు ఏర్పాటు చేసి వీటిని పెంచుతున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో మంచి డిమాండ్ ఉంది. వీటిని పెంచడం వల్ల అనేక లాభాలున్నాయని రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ డైరెక్టర్ ఆఫ్ ఫౌల్ట్రీ రీసెర్చ్(డీపీఆర్ ) శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇందుకు అనుగుణంగా రైతులకు శిక్షణ



ఇస్తున్నారు. కొత్త రకాల కోళ్లను ఇక్కడే పెంచి వాటి ఫలితాల ద్వారా మార్కెట్‌లో ఉంచుతున్నారు. డైరెక్టర్ ఆఫ్ ఫౌల్ట్రీ రీసెర్చ్ అభివృద్ధి చేసిన శ్రీనిధి కోళ్లకు ప్రత్యేకమైన పోషక విలువలు గల దాణా ఇస్తే... దేశవాళీ కోళ్ల కన్నా మరింత నాణ్యతగా గుడ్లు, మాంసం అందజేస్తుంది. పైగా పోషకాలు మెండుగా ఉంటాయి. పట్టణ మార్కెట్ కంటే దాదాపు 10 నుంచి 30 వరకు ధరలు అధికంగా ఉంటాయి.

### శ్రీనిధి ప్రత్యేకత..

సహజంగా లభించే వ్యర్థ పదార్థాలను తింటాయి. విభిన్న రంగులలో ఆకర్షణ కల్గిన ఈకలు, పొడవైన కాళ్లు ఉండటం వల్ల త్వరగా పరుగెత్తగలవు, అధిక రోగ నిరోధక శక్తి ఉంటుంది. దేశవాళి కోళ్ల కంటే ఎక్కువ గుడ్లు, మాంసం ఇస్తుంది. ఈ కోడి పిల్ల ఆరు వారాలకు 600 నుంచి 650 గ్రాముల వరకు పెరుగుతుంది. స్వచ్ఛమైన నీరు అందించాలి. 2.5 కేజీలకు పైగా పుంజులు పెరుగుతాయి. పెట్టలను (ఆడ) కోళ్లను సరైన విధంగా పెంచితే ఏడాదికి 150 వరకు గుడ్లు పెడతాయి. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రోగాలు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది. వాటి గుడ్లు 28 వారాలకు 48-50 గ్రాములు ,40 వారాలకు 52-55గ్రాములు, దేశవాళీ కోడి పొదిగినప్పుడు ఈ గుడ్లు వేస్తే పిల్లలు వస్తాయి. అప్పటి వరకు చల్లని ప్రదేశాల్లో ఉంచాలి. తక్కువ పెట్టుబడి, తక్కువ రిస్కుతో ఎక్కువ లాభాలు పొందవచ్చు. వివరాలకు రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ డైరెక్టర్ ఆఫ్ ఫౌల్ట్రీ రీసెర్చ్( డీపీఆర్), www.pdonpoultry. orgసంప్రదించాలని సూచించారు. దేశంలోని ఆయా రాష్ట్రాల పరిధిలో గల వెటర్నరీ, బ్రాంచ్ విశ్వవిద్యాలయాలు ఉన్నప్పటికీ, నాటు కోళ్లు ప్రధానంగా శ్రీనిధి కోళ్ల పేరెంట్ చిక్స్ మాత్రం ఇక్కడి నుంచే చేరుతాయని తెలిపారు. దక్షిణ భారత దేశంలోని రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు , తమిళనాడు, కర్ణాటకతో పాటు హైదరాబాద్ నుంచే తీసుకువెళ్తారు.

**దాణా :** మన సమీపంలో లభించే మొక్క జొన్న, జొన్న, రాగులు, సజ్జలు, తదితర తగు మోతాదులో వాడితే సరిపోతుంది. శ్రీనిధి కోళ్లను పెరట్లో కూడా పెంచవచ్చు.

### మంచి నాణ్యత..



"దేశంలో కోడి, గుడ్లను ఆహారంగా తీసుకునే వారి శాతం పెరిగింది. అందుకే ఫౌల్ట్రీ బిజినెస్ అధికమైంది. బ్రాయిలర్ చికెన్ వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయి. రూరల్ 70 శాతం , సిటీ 30 శాతం జోరుగా విక్రయాలు జరుగుతున్నాయి."

**- డా.నిరంజన్, సీనియర్ శాస్త్రవేత్త**